నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
18 వ
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా
బుధవారం,25 డిసెంబర్ 2024

చిరస్మరణీయుడు నాగిరెడ్డి సత్యనారాయణ

రామచంద్రపురం,మేజర్న్యూస్ : ద్రాక్షారామ నాటక కళా పరిషత్ శ్రీ దుర్గా ఆర్ట్స్ అండ్ ఫ్రెండ్స్ అసోసియేషన్, రంగస్థల వృత్తి కళాకాకారుల సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షులు దివంగత నాగిరెడ్డి సత్యనారాయణ ఆరవ వర్ధంతి హసన్‌బాద గ్రామంలో వారి స్వగ్రహం వద్ద ప్రస్తుత ద్రాక్షారామ నాటక కళాపరిషత్ అధ్యక్షులు, హసన్‌బాద గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ పెద్దలు చోడిశెట్టి వీరభద్రరావు, నీటి వినియోగదారుల సంఘం సభ్యులు బొల్లం సత్తిరాజు, పలువురు కళాకారులు పాల్గొని తొలుత దివంగత నాగిరెడ్డి సత్యనారాయణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దివంగత నాగిరెడ్డి సత్యనారాయణ చేసిన అనేక సాంస్కృతిక సామాజిక సేవలను పలువురు అభినందించారు. ఈ సంధర్భంగా సన్నాయి కళాకారులు పావులూరి చంటిని సర్పంచ్, గ్రామ పెద్దలు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో చోడిశెట్టి బాబులు, ఉంగరాల సత్తిబాబు, తిరగటి సత్యనారాయణ, గ్రామస్థులు, కళాకారులు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. రంగస్థల, సినీ నటి, పరిషత్ కార్యదర్శి సరోజ విలేఖర్లతో మాట్లాడుతూ తాను హైదరాబాద్‌లో షూటింగ్‌లో ఉండడం వలన ఈకార్యక్రమానికి రాలేకపోయానని తెలియజేస్తూ తనకు బొట్టుపెట్టి కళాకారిణిగా తీర్చిదిద్దిన నాగిరెడ్డి సత్యనారాయణకు నివాళి అర్పించారు. డాక్టర్ స్టాలిన్, బుర్రకథ కళాకారులు రాంబాబు, పరిషత్ ఉపాధ్యక్షులు కొండ, సహాయ కార్యదర్శి అయినవిల్లి సతీష్ బాబు, పలువురు కళాకారులు నాగిరెడ్డికి నివాళి అర్పించారు.

దేవాది దేవుడు, కరుణామయుడు, లోక రక్షకుడు ఏసుక్రీస్తు ప్రేమ,దయ,శాంతి గుణాలు..

– సమాజంలోని ప్రజల మనగడ, జీవన శైలిని ఎంతో అవసరం
– జిల్లా ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేసిన.
– మంత్రి కందుల దుర్గేష్
– కలెక్టర్ పి.ప్రశాంతి –సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం, మేజర్న్యూస్ : దేవాది దేవుడు, కరుణామయుడు, లోక రక్షకుడు అయిన ఏసుక్రీస్తు చూపిన ప్రేమ,అనురాగాలు సమాజంలోని ప్రజల మనగడ, జీవన శైలిని ఎంతో అవసరం అని రాష్ట్ర సాంస్కృతిక సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కందులుదుర్గేష్ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యం లో స్థానిక మంజీరా హోటల్ సమావేశ మందిరంలో నిర్వహించిన క్రిస్మస్ ఐటి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి కందుల దుర్గేష్ విచ్చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి, సిటీ శాసన సభ్యులు ఆదిరెడ్డి వాసు, ఏపీ స్టేట్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు బిషప్ డాక్టర్ ప్రతాప్ సిన్హా రాజమండ్రి పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షులు రెవ. డా.కేసుధీర్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు జన్మదిన వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందన్నారు.జిల్లాలోని ప్రజలంతా సుఖసంతోషాలతో అభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించా రన్నారు. మనిషికి మనిషికి అంతరం పెరిగిపోతున్న నేటి సమాజంలో ప్రేమ,సహనం, ఓర్పు వంటి అంశాలతో దగ్గరయ్యేందుకు ఏసుప్రభువు ప్రవచనాలు మాత్రమే ఉపయోగపడతాయన్నారు. దుష్టులను సహితం క్షమించడంతో పాటు తనను శిలువుని ఎక్కించిన వారిని సైతం క్షమించిన మహానుభావుడు ఏసుప్రభువు అన్నారు.సమాజ శాంతి కొరకు ప్రబోధించిన మహనీయులు ఏసుప్రభు అనిఅన్నారు. నిడదవోలు నియోజకవర్గంలో తన గెలుపుకు ఆ ప్రాంతపు దైవిజ్ఞనులు కృషి చేశారన్నారు.

బాప్టిజం చేసుకోవడానికి ఒక రేవు కావాలని కోరడం జరిగిందని అది అందించే దిశగా కృషి చేస్తానన్నారు. క్రైస్తవ స్మశాన వాటికకు కొన్ని ప్రాంతాల్లో స్థలాలు అందించేందుకు ప్రభుత్వ నిర్ణయం తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి మాట్లాడుతూ జిల్లా ప్రజలందరికీక్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేస్తున్నా నన్నారు. ఏసుక్రీస్తు ప్రపంచానికి గొప్ప వ్యక్తిని ఆయన ఏ సందేశాలు అయితే ప్రపంచానికి ఇచ్చారో అందరం నమ్మి ఆచరించాలని అదే శాంతి సందేశం అన్నారు. ఆయన మరణానికి కారణమైన వారిని క్షమించి వారిని కూడా మనతో సమానంగా చూడాలని అనే సందేశాన్ని మనందరికీ ఇచ్చారన్నారు. మనం ఎంత అభివృద్ధి చెందిన ఆ సమాజం సంతోషాంగా ఉండాలంటే శాంతి ప్రేమ క్షమాగుణం ఉండాలన్నారు. సమాజంలో ఒక వ్యక్తి తన వ్యక్తిగత జీవనంలో ఎలా ఉండాలని ఏసుప్రభువు అందరికీ నేర్పించారన్నారు.

ఆయన చెప్పిన మాటలు మన జీవన విధానానికి మంచి చేస్తాయ న్నారు. క్రిస్మస్ వేడుకల ద్వారా ఆదేవదేవుని గుర్తు చేసుకునేందుకు అవకాశం ఇచ్చిన మీ అందరికీ ధన్యవాదములు. ఈ క్రిస్మస్ ద్వారా ఆ దేవదేవుని దీవెనలు మీ కుటుంబ సభ్యులందరికీ ఉండాలని ఆశిస్తూ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేస్తున్నానన్నారు. సిటీ నియోజకవర్గ శాసనసభ్యులు ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ క్రీస్తు జన్మదిన సందర్భంగా అందరికి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో,రాష్ట్రంలో అందరూ బాగుండాలని ఆయన ఆకాంక్షిచారు.రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి కూటమి ప్రభుత్వం మీఅందరికీ అవసరమైన టువంటి పనులు చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. గత టిడిపి హయాంలో రు. 70 కోట్ల రూపాయలతో 945 చర్చిలను మరమ్మత్తులు చేయించడం జరిగిందన్నారు. అర్హులైన అందరికీ అన్ని సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. సరైన ప్రభుత్వం సరైన పాలకులు ఉన్నప్పుడే ప్రజలకు న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ క్రిస్మస్ సందర్భంగా నగర ప్రజలందరికీ మంచి జరగాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

ప్రేమ, కరుణ, సమానత్వమే క్రిస్మస్ సందేశం

– రాష్ట్ర కార్మికశాఖ మంత్రి సుభాష్

రామచంద్రపురం,మేజర్న్యూస్ : సాటివారి పట్ల ప్రేమ, దయాగుణం, సమానత్వమే యేసుక్రీస్తు బోధనల సారాంశం అని రాష్ట్ర కార్మికశాఖ మాత్యులు వాసంశెట్టి శుభాష్ అన్నారు. యేసు క్రీస్తు పుట్టినరోజును పురస్కరించుకొని మంత్రి సుభాష్ రాష్ట్ర ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే క్రిస్మస్ పర్వదినాన్ని రాష్ట్ర ప్రజలు సంతోషాలతో వేడుకలు జరుపుకోవాలని అభిలషించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ సమాజంలో శాంతియుత వాతావరణం, ప్రజల్లో ఐక్యత, సాటి మనుషుల పట్ల దయాగుణం, తగ్గింపుతనం క్రీస్తు సద్గుణాలని అన్నారు. కూటమి ప్రభుత్వం మైనార్టీలకు, పేదలకు అండగా ఉంటుందన్నారు. లోక రక్షకుడైన ప్రభువు కరుణా, కటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ యేసు శాంతి మార్గాన్ని అనుసరించి, ప్రేమతత్వాన్ని పెంపొందించుకుని, ఈర్ష్య ద్వేషాలు పారద్రోలాలన్నారు. యేసుక్రీస్తు కలిగిన ప్రేమను ప్రతిఒక్కరు కలిగిఉండి, సక్రమమైన మార్గంలో నడుచుకోవాలని మంత్రి సుభాష్ కోరారు.

శ్రీ సత్యదేవుని దర్శించుకున్న కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్

అన్నవరం, మేజర్ న్యూస్ : కాకినాడ జిల్లా అన్నవరం ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవర శ్రీ వీర వెంకట సత్యనారాయణస్వామివారి దర్శనార్థం కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ కుటుంబ సమేతంగా శ్రీ స్వామివారి సన్నిధికి విచ్చేశారు. ముందుగా ఆలయ అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం వ్రతమాచరించి, శ్రీ స్వామి, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనం అనంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం అందించగా దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు, దేవస్థానం ఐవి రోహిత్ శ్రీ స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

గ్రామాలలో స్మశానవాటిక ఏర్పాటు కోసం తాసిల్దార్‌కు వినతి పత్రం అందజేత

ఎటపాక, మేజర్ న్యూస్ : అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం లక్ష్మీపురం గ్రామంలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించడం జరిగింది. గ్రామాలలో స్మశానవాటిక ఏర్పాటు కొరకు ఎటపాక తహసీల్దార్ కు వైసీపీ సీనియర్ నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు మాట్లాడుతూ ఎటపాక మండలంలోని వున్నా గ్రామాలలో స్మశాన వాటిక లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఒక మనిషి చనిపోతే ఆరడుగుల నెల కావాలి అని, ఆ ఆరడుగుల నెల లేక ఇబ్బందులు పడుతున్నవారు ఎందరో అని, ముఖ్యంగా నిరుపేద, దళిత, గిరిజన ప్రజలు ఎందరో వున్నారు అని, ప్రతి గ్రామంలోనూ ప్రభుత్వ భూములు ఎన్నో ఉన్నాయని, ఆ భూములలో కొంత భూమిని స్మశాన వాటికకు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పూనెం వెంకట్రా రావు, పణిత అరుణ, సొందే రమేష్, టీడీపీ నాయకులు ఉండేటి వెంకన్న, జనసేన నాయకులు మెళ్ల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఏడిబి రోడ్డు విస్తరణ పనులను పరిశీలించిన కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్

కాకినాడ, మేజర్ న్యూస్ : రాజమహేంద్రవరం నుండి పెద్దాపురం, సామర్లకోట మీదుగా కాకినాడ పోర్ట్ వరకు చేపడుతున్న ఏడిబి రోడ్డు విస్తరణ పనులను మంగళవారం కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలలలోపే రహదారి విస్తరణ పనులు చేపట్టడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల నిరంతర పర్యవేక్షణతో పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం రోడ్డు విస్తరణ పనులను గాలికి వదిలే యడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. రోడ్డు విస్తరణ పనులను నాణ్యతలో రాజీ లేకుండా త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులో తీసుకురావాలని ఈ సందర్భంగా ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ సంబంధిత అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

ఆత్రేయపురం,మేజర్న్యూస్ : బొబ్బర్లంక ధవలేశ్వరం మధ్య బ్యారేజీ వెంబడి రొయ్య సీడు చేపల వేట సమయంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని కొత్తపేట డిఎస్పి వై.గోవిందరావు అన్నారు. మంగళవారం బొబ్బర్లంక వద్ద ఫిషర్‌మెన్ సొసైటీ సభ్యులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.చేపలు వేటాడే సమయంలో ఒక్కోసారి గ్రామాల మధ్య సరిహద్దు తగాదాలు ఏర్పరచుకుని శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారన్నారు. సమన్వయంతో వ్యవహరించి ఇబ్బందులు లేకుండా వేట ఆడుకోవాలని సూచించారు. లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట రావులపాలెం రూరల్ సీఐ విద్యాసాగర్, ఎస్ఐ ఎస్.రాము తదితరులు ఉన్నారు.

ఆదిత్య డిగ్రీ కళాశాలలో జాతీయ దంత వైద్యుల దినోత్సవం

– డాక్టర్ అడ్డాల సేవలు యువతకు ఆదర్శనీయం
– అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడు

కాకినాడ,మేజర్న్యూస్ :స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో జాతీయ దంతవైద్యుల దినోత్సవం నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ మరియు పీ జీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి ఈ వి ఎల్ నాయుడు తెలియజేశారు.ఆధునిక దంతవైద్య పితామహులు పద్మభూషణ్ డాక్టర్. ఆర్.అహ్మద్ జయంతిని ప్రతి సంవత్సరం జాతీయ దంత వైద్యుల దినోత్స వంగా జరుపుకుంటారు. ఈ సందర్భంగా ఆదిత్య డిగ్రీ కళాశాలలో దంత వైద్యుల దినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ దంత వైద్యులు డాక్టర్ అడ్డాల సత్యనారాయణ ను అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడు సత్కరించారు.ఈ సందర్భంగా డాక్టర్ నాయుడు మాట్లాడుతూ డాక్టర్ అడ్డాల సత్యనారాయణ గారు సేవలు యువతకు ఆదర్శమని అన్నారు. డాక్టర్ అడ్డాల గత 26 సంవత్సరాలుగా కాకినాడ మరియు పరిసర గ్రామీణ ప్రాం తాలలో ప్రజలకు నిరంతర వైద్య సేవలు అందిస్తున్నారని కొనియాడారు. దంతవైద్యుడు, విద్యావేత్త మరియు తరువాత పశ్చిమ బెంగాల్ మంత్రి వర్గంలో మంత్రి, భారతదేశం యొక్క మొదటి దంత కళాశాల స్థాపించిన డాక్టర్.ఆర్.అహ్మద్, డెంటల్ కాలేజ్, హాస్పిటల్‌ను స్థాపించారని అన్నారు. భారతదేశంలో ఆధునిక దంతవైద్యం యొక్క పితామహుడిగా స్మరించుకుంటూ 2016లో, ఇండియన్ డెంటల్ అసోసియేషన్ అతని గౌరవార్థం డిసెంబర్ 24ని జాతీయ దంతవైద్యుల దినోత్సవంగా ప్రకటించింది అని డా అడ్డాల తెలిపారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహి చిన ఎన్ ఎస్ ఎస్ బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి అభినందిం చారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ,ఎన్ఎస్-ఎస్ ప్రోగ్రాం అధికారులు తేజేశ్వరరావు , గౌరీ ప్రియ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదిత్య డిగ్రీ కళాశాల మరియు పీజీ కళాశాలలో క్రిస్మస్ వేడుకలు

కాకినాడ, మేజర్న్యూస్ : స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల,పీజీ కళాశాల(స్వయం ప్రతిపత్తి) జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఈవిఎల్ నాయుడు తెలియజేశారు. క్రిస్మస్ ఏసుక్రీస్తు జననా నికి గుర్తుగా ప్రపంచవ్యాప్తంగా కోట్ల మంది ప్రజలు జరుపుకునే పండుగ. ఈ సందర్భంగా ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆదిత్య స్కూల్ ఆఫ్ మేనేజ్మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ మహమ్మద్ షాహిద్దీన్ మాట్లాడుతూ మతము లోకహితమని అన్నారు. శాంతి, సహనం, మానవత్వమే క్రీస్తు సందేశం అని, విద్యార్థులు తమ లక్ష్యాన్ని చేరుకోవడానికి గొప్ప ప్రయత్నం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్ ఎస్ ఎస్, స్కూల్ ఆఫ్ మేనేజ్మెంట్ అధ్యాపక బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జట్ల గణేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి తేజేశ్వరరావు,అధ్యాపకులు ఎస్ కృష్ణ బాబు, పి సురేష్, పి గంగాధర్, సత్య శిరీష, విజయలక్ష్మి మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణాలు గడువులోగా పూర్తి చేయాలి

– రాష్ట్ర కార్మికశాఖ మంత్రి సుభాష్

రామచంద్రపురం, మేజర్ న్యూస్ : నియోజవర్గంలోని రోడ్ల నిర్మాణాలు వచ్చే సంక్రాంతిలోగా పూర్తి చేయాలని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అధికారులు ఆదేశించారు. మంగళవారం రామచంద్రపురంలో మంత్రి సుభాష్ పంచాయతీరాజ్, మరియు ఆర్ అండ్ బి అధికారులతో రోడ్ల నిర్మాణ పురోగతిపై సమీక్షించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు శిథిలావస్థలో ఉన్న రోడ్లతో పాటు, కొత్త రోడ్లు నిర్మాణం వచ్చే సంక్రాంతి నాటికి పూర్తి అయ్యేలా తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇప్పటికే పురోగతిలో ఉన్న రోడ్లు, నూతన ప్రతిపాదనలు వెరసి కోట్లాది రూపాయలు హెచ్చించినట్టు తెలిపారు. ఆర్ అండ్ బి పరిధిలో రూ.7.86 కోట్లతో 87 కిలోమీటర్ల మేర 23 పనులు జరుగుతున్నాయని అధికారులు మంత్రికి వివరించారు. ఇవి కాకుండా రూ.3.5 కోట్లతో తిప్పరాజుపాలెం నుంచి కాజులూరు రోడ్డు నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపినట్టు తెలిపారు. అలాగే కాజులూరు మండలంలో 27 పనులకు సంబంధించి 9 పనులు ఇప్పటికే పూర్తి చేశామన్నారు. బీటీ రోడ్ల నిర్మాణం కోసం రూ.30.5 కోట్లతో 35.95 కిలోమీటర్ల మేర రోడ్లు నిర్మాణం చేపట్టేందుకు ప్రతిపాదనలు పంపామని నిధులు మంజూరయ్యేలా చర్యలు గైకొనాలని మంత్రి సుభాష్ ను కోరారు . అలాగే పల్లె పండుగ కార్యక్రమంలో రూ.3.34 కోట్లతో 5.92 కిలోమీటర్ల సిమెంట్ రోడ్ల నిర్మాణానికి, 0.53 కిలోమీటర్ల మేర డ్రైన్స్ నిర్మాణం కోసం పనులు చేపట్టామని, వీటిలో 9 పనులు పూర్తయినట్లు తెలిపారు. అలాగే రామచంద్రపురం లో రూ.3.9 కోట్లతో 7.6 కిలోమీటర్లు పనులు నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. గంగవరం మండలంలో రూ.1.17 కోట్లతో 24 పనులు 2.69 కిలోమీటర్ల మేర పనులు జరుగుతున్నాయని వివరించారు. ఇవి కాకుండా రామచంద్రపురం, గంగవరం మండలంలో రూ.7.2 కోట్లతో 67 పనులకు ప్రతిపాదనలు పంపా మ న్నారు. త్వరలోనే పనులన్నీ పూర్తవుతాయని మంత్రి సుభాష్‌కు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ పనులు వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డిప్యూటీ ఈఈ సత్య శ్రీనివాస్, డిప్యూటీ ఈఈ ఎ.ఎస్.ఎన్.బాబు, డిఈఈ సూర్యనారాయణ, జెఈ లు భవాని శంకర్, వెంకటేశ్వరరావు, ఆర్అండ్‌బి డిఈ కామేశ్వరరావు, జెఈలు ప్రసన్న, రమణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీలకు కాకినాడ జిల్లా క్రీడాకారుల ఎంపిక

కాకినాడ, మేజర్న్యూస్ : డిసెంబర్ 27, 28, 29 తేదీల్లో విజయవాడలో జరిగే 35వ సౌత్ జోన్ నేషనల్ స్విమ్మింగ్ పోటీలకు కాకినాడ జిల్లా నుంచి స్విమ్మింగ్ క్రీడాకారులు ఎంపికయ్యారు. ఎంపికైనవారిలో ఐ.కే.దర్శిల్, ఎం.షణ్ముఖ వీర్, ఎం.యశస్విని, డి.మణికంఠ నవీన్ ఉన్నారు. వీరు నలుగురు విజయవాడలో జరిగే పోటీల్లో పాల్గొంటారు. కాకినాడ జిల్లా సిమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షులు పెద్దిరెడ్డి సతీష్, అసోసియేషన్ కార్యదర్శి ఇరుసుమల్ల రాజు, డిఎస్‌డిఓ శ్రీనివాసు, కోచ్ అప్పలనాయుడు, ముఖ్య సలహాదారుడు మంగా వెంకటశివ రామకృష్ణ, క్రీడాకారులను కాకినాడ జిల్లా స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో అభినందించారు. జిల్లా అధ్యక్షుడు పెద్దిరెడ్డి సతీష్ మాట్లాడుతూ సిమ్మింగ్‌లో క్రీడాకారులకు మంచి శిక్షణ ఇవ్వడం జరిగిందని, జాతీయ స్థాయిలో జరిగే మీట్‌లో విజయం సాధించి కాకినాడ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

చిన్నారి వైద్యానికి రూ.11 లక్షలు మంజూరు

– ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే శిరీష దేవి

రంపచోడవరం, మేజర్ న్యూస్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి విజయభాస్కర్ మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా లివర్ బాధిత పాప వైద్యం ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం నుంచి రూ.11 లక్షలు ఎమ్మెల్యే శిరీష దేవి మంజూరు చేయించారు. రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి విజయభాస్కర్ దంపతులు రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడును మర్యాదపూర్వకంగా కలిసి, ఏజెన్సీ ప్రాంతంలో పలు సమస్యలు ఆయన దృష్టికి తెచ్చారు. ముఖ్యంగా తీవ్రమైన వ్యాధి సమస్యతో బాధపడుతున్న ఎటపాక మండలం నెల్లిపాక గ్రామస్తులైన కొత్తపల్లి జయరాజు కుమార్తె మోక్షిత (3 సం.లు) అనే పాపకు వైద్యం ఖర్చులకు రూ.22 లక్షలు ఖర్చు అవుతుందని తెలియజేశారు. ఈ విషయం తెలుసుకున్న రంపచోడవరం ఎమ్మెల్యే శిరీష దేవి విజయభాస్కర్ దంపతులు ఈ విషయం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును నేరుగా కలిసి వారి సమస్యను వివరంగా తెలియపరచడం జరిగింది. దీనిపై రాష్ట్ర ముఖ్యమంత్రి సాను కూలంగా స్పందించారు. లివర్ సమస్యతో బాధపడుతున్న ఆ కుటుంబానికి వెంటనే తక్షణ సాయం కింద 11 లక్షల రూపాయలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంజూరు చేయడం జరిగింది.

రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం విక్రయించాలి

– దళారులకు ధాన్యం అమ్మి మోసపోవద్దు –సబ్ కలెక్టర్

రాజవొమ్మంగి, మేజర్న్యూస్ : రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించాలని దళారులకు అమ్మి మోసపోవద్దని రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ అన్నారు. మంగళవారం మండలంలోని వట్టిగడ్డ గ్రామ శివారులో ధాన్యం (రాశులు)బస్తాలతో రోడ్డుపై ఉన్న రైతులతో సబ్ కలెక్టర్ కల్పశ్రీ మాట్లాడటం జరిగింది. ఈ సందర్భంగా రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సబ్ కలెక్టర్ వెంటతహశీల్దార్ అల్లు సత్యనారాయణ, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

పిసా కమిటీ కార్యదర్శిగా పూనెం గోపాల్

ఎటపాక, మేజర్న్యూస్ : అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం రాయణపేట పంచాయతీలో పెసా ఎన్నిక నిర్వహించడం జరిగింది. ఈ ఎన్నికలో పూనెం గోపాల్ కార్యదర్శిగా ఎన్నిక కావడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాపై ఎంతో బాధ్యతతో ఈ పదవులు మాకు ఇవ్వడం జరిగిందని, ఈ గ్రామ ప్రజలు మాపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ముచేయబోమని, చట్టానికి అనుగుణంగా ప్రతి పనిలోనూ మీ అందరి సహకారాలతో మా బాధ్యతలను స్వీకరిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. ముఖ్యంగా ఈ ప్రాంతంలో భూ సమస్యలు, అటవీ సమస్యలు, వలస గిరిజనేతరుల సమస్యలు అధికంగా ఉన్న నేపథ్యంలో ఈ పెసా కమిటీలు ఏర్పాటు చేయడం ఈ ఐదవ షెడ్యూల్ భూభాగంలో ఉంటున్న ఆదివాసులందరికీ ఒక విముక్తి లాంటిదని, ఎంతో కార్యశుద్ధితోఈకార్యక్రమాలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషికి ప్రత్యేక ధన్యవాదములు తెలియజేస్తున్నాను అని ఆయన అన్నారు.

రైల్వే స్టేషన్‌లో రైళ్ల పునరుద్ధరణకు బిజెపి పార్టీ కృషి

కొవ్వూరు, మేజర్ న్యూస్ : కొవ్వూరు రైల్వే స్టేషన్‌లో రైళ్ల పునరుద్ధరణ కొరకు బిజెపి పార్టీ కృషి చేస్తుందని ఆ పార్టీ నాయకులు తెలిపారు. మంగళవారం రాజమహేంద్రవరంలో ఎంపీ పురందేశ్వరిని కలిసి కొవ్వూరులో రైళ్ల నిలుపుదలపై వినతి పత్రం అందజేశారు. కొవ్వూరు ప్రెస్ క్లబ్ లో బిజెపి నాయకులు ప్రెస్ మీట్ నిర్వహించారు. పిక్కి నాగేంద్ర కొవ్వూరు మున్సిపల్ 9వ వార్డు కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణలు మాట్లాడుతూ కొవ్వూరు రైల్వే స్టేషన్‌లో కోవిడ్ కారణంగా నిలుపుదల చేసిన రైళ్ల హాల్ట్ పునరుద్ధరించకపోవడంతో కొవ్వూరు, గోపాలపురం,పోలవరం నియోజకవర్గంలో సుమారు100కు పైగా గ్రామాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. దీనిపై గత ప్రభుత్వంలో కొవ్వూరు నుండి రాజమహేంద్రవరం కలెక్టరేట్ వరకు పాదయాత్ర చేపట్టడం జరిగిందన్నారు. అనంతరం ఓటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రైళ్ల హాల్టును పునరుద్ధరించడం జరుగుతుందని చెప్పడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరుని కలవడం జరిగిందన్నారు. కొవ్వూరు డివిజన్ ప్రజలు పడుతున్న ఇబ్బందులను తెలియజేయడం జరిగిందన్నారు. దీనిపై పురందేశ్వరి కేంద్ర రైల్వే శాఖ

మంత్రి అశ్విన్ వైష్ణవును కొవ్వూరు పరిశ్రమ ప్రాంత ప్రజల సౌకర్యార్థం అత్యవసరంగా ఐదు రైళ్లను సర్కార్, సింహాద్రి,తిరుమల, తిరుపతి ఎక్స్ప్రెస్, రాజమహేంద్రవరం నుండి భీమవరం వెళ్ళు రైళ్లు నిలుపుదల చేయాలని కోరడం జరిగిందన్నారు. కొవ్వూరులో రైళ్ల పునరుద్ధరణకు వెంటనే నిర్ణయం తీసుకోవాలని మాట్లాడడం జరిగిందన్నారు. ఈనెల 29వ తేదీ అశ్విని వైష్ణవను స్వయంగా కలవడానికి అపాయింట్మెంట్ కోరడం జరిగిందన్నారు. కొవ్వూరులో ఎక్స్ప్రెస్ రైళ్ల నిలుపుదలకు బిజెపి నాయకులు,కార్యకర్తలు చేసిన పోరాటం మరి ఏ పార్టీ గాని చేయలేద న్నారు. ప్రజల ఇబ్బందులు దృష్టిలో ఉంచుకుని అవకాశం వచ్చినప్పుడల్లా ప్రజాప్రతినిధులను కోరుతున్నామన్నారు. ఎన్డీఏ కూటమి ఆధ్వర్యంలో రాబోయే మరికొన్ని రోజుల్లో మరో ఐదు రైళ్లు ఆగుతాయని తెలియజేశారు. కొంతమంది బిజెపి పార్టీపై అసత్యాలను ప్రచారం చేస్తున్నారన్నారు.

అంతేకాకుండా కూటమి పార్టీల మధ్య చిచ్చుపెట్టేలా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారని అన్నారు.ఇది పద్ధతి కాదని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. కొవ్వూరు రైల్వే స్టేషన్ లో రైళ్ల హాల్ట్ తో పాటు ఆర్టీసీ ఎక్స్ప్రెస్ బస్సులు కొవ్వూరు టౌన్ లోకి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీ పురందేశ్వరిని కోరడం జరిగిందన్నారు. జిల్లా కలెక్టర్ తో మాట్లాడి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని అన్నారు.ఈ కార్యక్రమంలో బోడపాటి ముత్యాలరావు, మట్టా ఆంజనేయులు, ముప్పరాజు శ్రీనివాసరావు, సాయి తదితరులు పాల్గొన్నారు.

జెసి రాహుల్ మీనాను మర్యాదపూర్వకంగా కలిసిన ఎపిఎన్‌జిజివో జిల్లా సంఘం

కాకినాడ,మేజర్న్యూస్ : ఎపిఎన్‌జిజివో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుల గుద్దటి రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాని మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్చం ఇవ్వడం జరిగినది మరియు ఉమ్మడి తూర్పుగో దావరి జిల్లా నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘం యొక్క భవనం గురించి తలెత్తిన సమస్యలపై పరిష్కారం కొరకు రిప్రజెంటేషన్ సమర్పించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఎపిఎన్‌జిజివో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి పేపకాయల వెంకట కృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు పసుపులేటి శ్రీనివాస్, ఎపిఎన్‌జిజివో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సహ అధ్యక్షులు మట్టపర్తి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు పాలపర్తి మూర్తిబాబు, మరియు ఎపిఎన్‌జిజివో కాకినాడ తాలూకా యూనిట్ ఏ.సత్తిరాజు మరియు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘ అధ్యక్షులు, వారి కార్యవర్గము పాల్గొన్నారు.

జగ్గిరెడ్డి ఆరోపణలు హాస్యాస్పదం..

కొత్తపేట, మేజర్న్యూస్ : ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పై మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి చేసిన ఆరోపణలు చాలా హాస్యా స్పదంగా ఉన్నాయని స్థానిక పంచాయితీ కార్యాలయం వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కొత్తపేట మండల తెదేపా అధ్యక్షుడు కంఠంశెట్టి శ్రీనివాసరావు అన్నారు.ఈ సమావేశంలో తెదేపా నాయకులు మాట్లాడుతూ జగ్గిరెడ్డి తన స్థాయికి తగినట్లుగా చిల్లర ఆరోపణలు చేస్తున్నారని ఎద్దేవాచేశారు. కొత్తపేటలో చికెన్ సెంటర్‌కి ఎస్ఓసి విషయమై డబ్బులు తీసుకున్నట్లు చేసిన ఆరోపణ హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. పంచాయతీ పరిధిలో కౌశిక్ రోడ్డు వెంబడి పలు అక్రమ కట్టడాలు ఎమ్మెల్యేగా జగ్గిరెడ్డి ఉండగానే వేలిసాయన్నారు.పలివెల వంతన సమీపంలో ఆయన ఆరోపిస్తున్న నిర్మాణాలుకు మీ హయాంలోనే పునాదులు పడ్డాయని ఆరోపించారు.అనుమతులుపై అప్పటి గ్రామ కార్యదర్శి పాత్రను నిలదీయకుండా సంబంధం లేని ఎమ్మెల్యే సత్యానందరావు గారిపై ఆరోపణలు చేయడం ఆయన దిగజారు దుతనానికి నిదర్శనంగా ఉందన్నారు.డబ్బులు తీసుకుని పోస్టింగ్ ఇచ్చే సంస్కృతిని జగ్గిరెడ్డి ప్రవేశపెట్టారని విమర్శించారు.2019–24 మధ్య పోస్టింగులు పొందిన పలువురు అధికారులుపై అప్పట్లోనే ఆరోపణలు వచ్చాయన్నారు.ప్రస్తుతం రావులపాలెం కార్యదర్శిగా పనిచేస్తునన్న గతంలో ఆయన ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు రావులపాలెంలోనే పనిచేశారన్న విషయాన్ని మర్చిపోయారని అన్నారు.ఆయనకు అత్యంత విశ్వాస పాత్రుడైన కొత్తపేట కార్యదర్శి ఎన్వోసీ పత్రం అందించారని ఆయన చెప్తున్నారని,ఆ కార్యదర్శి బదిలీపై ఆయన పడుతున్న ఆవేదన అర్థమవుతుందని ఆరోపిం చారు.తాను చేసే పనులు ఎదుటివారికి ఆపాదించడం ఆయనకు అలవాటుగా మారిందన్నారు.ఇకనైనా జగ్గిరెడ్డి చిల్లర ఆరోపణలు మానుకోవాలని తెదేపా నాయకులు కోరారు.ఈ సమావేశంలో గ్రామ సర్పంచ్ బూసి జయలక్ష్మి,ఎంపీటీసీ రెడ్డి శ్రీనివాస్,పల్లి ఏసు, కముజు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

– జగ్గంపేట సీఐ

జగ్గంపేట, మేజర్ న్యూస్ : ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్ప నిసరిగా ధరించాలని జగ్గంపేట సీఐ వై ఆర్ కే శ్రీనివాస్ సూచించారు. మంగళవారం జగ్గంపేట పోలీస్ సర్కిల్ పరిధిలో జగ్గంపేట సీఐ ఆధ్వర్యంలో జగ్గంపేట ఎస్సై రఘునాథరావు, గండేపల్లి ఎస్సై శివ నాగబాబు, సిబ్బంది హెల్మెట్లు ధరించి ర్యాలీ చేపట్టారు. హెల్మెట్ ధరించి రోడ్డు ప్రమాదాల్లో మరణాల సంఖ్య తగ్గించాలని నినాదాలు చేశారు. హెల్మెట్ల వాడకంతో ప్రమాదం జరిగిన సమయంలో ప్రాణాపాయం తప్పుతుందన్నారు. వాహనదారులు వాహనాలు నడిపే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నూతనముగా నిర్మించుచున్న ఎస్‌టిపిని త్వరితగతిని పూర్తి చేయాలి

– కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ : నేషనల్ రివర్ కన్జర్వేషన్ ప్రాజెక్టులో భాగంగా రూ.95.50 కోట్ల వ్యయంతో నిర్మించుచున్న 50.6 ఎంఎల్‌డి సల్లేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఎస్‌టిపి ఫిబ్రవరి, 2025 నాటికి పూర్తి చేయాలని నగరపాలక సంస్థ యింజనీరింగు అధికారులను కమిషనరు కేతన్ గార్గ్, ఐ.ఎ.ఎస్., వారు ఆదేశించారు. ది.24–12–2024 సాయంత్రం యింజనీరింగ్ అధికారులతో కలిసి నిర్మాణంలో ఉన్న ఎస్‌టిపిని పరిశీలించారు. ప్రస్తుతము నగరపాలక సంస్థ గతంలో నిర్మించిన 30 ఎంఎల్‌డి సామర్థ్యం గల ఎస్‌టిపి వినియోగించుచున్నామని, భవిష్యత్ అవసరాలను దృష్టిలో వుంచుకొని అదనముగా 50.6 ఎంఎల్‌డి సామర్థ్యం గల ఎస్‌టిపి నిర్మించడం జరుగుచున్నదని, పరిసర గ్రామాలు విలీనము అయినా కూడా ఎస్‌టిపి ఉపయోగపడు తుందని అన్నారు. ఇప్పటి వరకు 33% పనులు పూర్తి అయ్యాయని, మిగిలిన అన్ని పనులు ఫిబ్రవరి, 2025 నాటికి పూర్తి చేయగలమని, పనులు వేగవంతం చేస్తున్నామని అన్నారు.

నాణ్యత విషయంలో ఎటువంటి రాజీ పడటానికి వీలులేదని, ఎప్పటికప్పుడు పనులు తనిఖీ చేయడం జరుగుతుందని తెలియచేసారు. పనులు పూర్తి నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో సూపరింటెండింగ్ ఇంజనీరు జి.పాండురంగారావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ షేక్ మదర్సా ఆలీ, డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు విరూపాక్షరావు తదితరులు పాల్గొన్నారు.

భారీవాహనాలకు అనుమతి లేదు...

ధవళేశ్వరం,మేజర్న్యూస్ : ధవళేశ్వరం పరిధిలో ఉన్నటువంటి కాటన్ బ్యారేజ్ నందు భారీ వాహనాలు వెళ్ళకుండా నీటిపారుదల అధికారులతోనూ మరియు బ్యారేజ్ అధికారులతో సౌత్ జోన్ డిఎస్పీ అయినటువంటి భవ్య కిషోర్ మరియు సి ఐ,గణేష్ ఎస్ఐ హరిబాబు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి చర్చించారు.

కాకినాడలో శాఖను తెరవనున్న యుటిఐ మ్యూచువల్ ఫండ్

కాకినాడ,మేజర్ న్యూస్ : భారతదేశంలోని ప్రముఖ అసెట్ మేనేజ్‌మెంట్ సంస్థల్లో ఒకటైన యుటిఐ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ (యుటిఐ ఏఎంసి), ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడలో షాప్ నెం./డి నం 25–6–37, గ్రౌండ్ ఫ్లోర్, గంజాం వారి వీధి, కాకినాడ 533001 వద్ద తమ యుఎఫ్‌సిని ప్రారంభించనున్నట్లు వెల్లడించింది. 26 డిసెంబర్ 2024న దక్షిణ, తూర్పు మరియు ఉత్తర భారతదేశం అంతటా 16 కొత్త యుటిఐ ఫైనాన్షియల్ సెంటర్‌లను (శాఖలు) ప్రారంభిస్తున్నట్లు కంపెనీ ప్రకటించింది. ఆర్థిక చేరికను ప్రోత్సహించడానికి మరియు మ్యూచువల్ ఫండ్ పెట్టుబడుల ద్వారా ప్రధాన స్రవంతి ఆర్థిక పర్యావరణ వ్యవస్థలోకి బి 30 నగరాల నుండి పెట్టుబడిదారులను తీసుకురావడానికి దేశవ్యాప్తంగా తమ పరిధిని విస్తరించాలని యుటిఐ లక్ష్యంగా పెట్టుకుంది. ఇమ్తియాజుర్ రెహమాన్, ఎండి మరియు సీఈఓ మాట్లాడుతూ, "మేము వ్యూహాత్మకంగా యుటిఐ ఫైనాన్షియల్ సెంటర్‌లను ప్రారంభిస్తున్నాము,మాఆఫరింగ్‌ల యొక్క పూర్తి శ్రేణిని వినియోగదారులకు చాలా దగ్గరగా అందుబాటులో ఉండేలా చూస్తాము.గతకొద్దికాలంగా మ్యూచువల్ ఫండ్ పెట్టుబడులలో వ్యక్తిగత పెట్టుబడిదారుల భాగస్వామ్యంలో పెరుగుదల, ముఖ్యంగా బి30 నగరాల్లో, మా విస్తరణ చాలా ప్రోత్సాహకరంగా ఉంది. ఆర్థిక సేవలను సులభతరం చేయడం,అవగాహన కల్పించడం మరియు మ్యూచువల్ ఫండ్ పెట్టుబడులను అందరికీ అందుబాటులో ఉంచడం వంటి దీర్ఘకాలిక లక్ష్యాలకు అనుగుణముగా ఇవి ఉంటాయి" అని అన్నారు. యుటిఐ మ్యూచువల్ ఫండ్ తన పెట్టుబడిదారులను ఆర్థిక కేంద్రాలు (యుఎఫ్‌సిలు),బిజినెస్ డెవలప్‌మెంట్ అసోసియేట్స్,మ్యూచువల్ ఫండ్ డిస్ట్రిబ్యూటర్స్ (ఎంఎఫ్‌డిలు) మరియుబ్యాంకులతో వ్యూహాత్మక భాగస్వామ్యాలను కలిగి ఉన్న బలమైన పంపిణీ నెట్‌వర్క్ ద్వారా చేరుకోవడానికి అంకితం చేయబడింది.

దుగ్గుదూరు, ఉప్పుమిల్లి రైతులకు నీటి కొరత లేకుండా చూస్తాం

– రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట – రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్

ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్యబ్యూరో : రామచంద్రపురం నియోజవర్గం కాజులూరు మండల పరిధిలోని దుగ్గుదూరు, ఉప్పుమిల్లి గ్రామాల రైతులకు సాగునీటి ఎద్దడి లేకుండా తగు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. మంగళవారం మంత్రి సుభాష్ ఇరిగేషన్ శాఖ అధికారులు, రైతులతో కలిసి పలు పంట కాలువలు, డ్రైన్‌లను పరిశీలించారు. ప్రస్తుత రబీ సీజన్లో రైతులకు ఎలాంటి నీటి కొరత లేకుండా తగు చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. దుగ్గుదూరు ఛానల్, కుయ్యేరు ఈస్ట్ సైడ్ ఉన్న మూడువేల ఎకరాల్లో సుమారు వెయ్యి ఎకరాలకు సాగునీటి కొరత వస్తున్న నేపథ్యంలో సాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులకు మంత్రి సుభాష్ సూచించారు. అందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలన్నారు. అన్నదాతలను ఆదుకునేందుకు, వ్యవసాయ రంగానికి ప్రాధాన్యతనిస్తూ బడ్జెట్లో నిధులు కేటాయించామన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతన్నలను అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వ పరంగా ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకొస్తే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ (ఎపిఎస్ఐడిసి) అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. రబీ సీజన్లో మినహా ఖరీఫ్ సీజన్లో సాగునీటికి ఎలాంటి కొరత లేదని మంత్రి సుభాష్ కు ఇరిగేషన్ అధికారులు వివరించారు. మంత్రి సుభాష్ వెంట ఇరిగేషన్ ఈఈ వి.వి.రామకృష్ణ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ యు.రమేష్‌బాబు, ఏఈ విన్నకోటి సుజాత, కూటమి నాయకులు, పలువురు రైతులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

– యువత తలుచుకుంటే సైబర్ నేరాల కట్టడి సాధ్యం

– సిఐ సుమంత్ ఎస్సై శ్రీను నాయక్

అనపర్తి, మేజర్ న్యూస్ : నేటి సమాజంలో సైబర్ నేరాలకు హద్దు, అదుపు లేకుండా పోతుందని, ముఖ్యంగా అమాయక ప్రజలను టార్గెట్ చేసి సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని సైబర్ నేరాలు కట్టడికి విద్యార్థులు ముందుండి ప్రజలకు అవగాహన కల్పించేందుకు సహకరించాలని అనపర్తి సిఐ సుమంత్ అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం అనపర్తి గ్రామంలోని జిబిఆర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహనతో పాటు వాటి కట్టడికి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సి.ఐ. సుమంత్, ఎస్సై శ్రీను నాయక్ మాట్లాడుతూ నేటి సమాజంలో సైబర్ నేరాలు అధికమయ్యాయని, అనేక రకాలుగా సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు అవగాహన కల్పించడంలో విద్యార్థులు ముందుండాలని, సైబర్ నేరాల కట్టడికి విద్యార్థులు సహకరించాలని అన్నారు. విద్యార్థుల్లో కూడా కొంతమంది మత్తు పదార్థాలకు బానిసై యువత తన భవిష్యత్తును పాడు చేసుకుంటున్నారని, డ్రగ్స్ రహిత సమాజం కోసం యువత ముందుకు రావాలని అన్నారు. యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడి నాటు సారా, గంజాయి తదితర మాదక ద్రవ్యాలకు బానిసలై వారి భవిష్యత్తును అంతకారం చేసుకుంటున్నారని యువత మేలుకో, భవితను మలుచుకో డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించుకో అని పిలుపునిచ్చారు. పల్లె ప్రాంతంలో ప్రజలు సెల్ ఫోన్ ఉపయోగంలో పూర్తి అవగాహన లేకపోవడంతో సైబర్ నేరగాళ్లు వాళ్ళని టార్గెట్ చేస్తున్నారని, ఓ యల్ యాక్స్ , లోన్ యాప్ తదితర వాటిని ఉపయోగించి ప్రజలకు లేనిపోని అసలు కల్పించి నేరాలకు పాల్పడుతున్నారని, ఎవరైనా ఫోన్ చేసి ఓటీపీ చెప్పమన్నా ఎవరికి ఓటిపిలు చెప్పవద్దని, బ్యాంకు వివరాలు ఎవరికీ తెలియపరచవద్దని అన్నారు. ఎవరైన వీడియో కాల్స్ చేసి బెదిరించినట్లయితే నేరుగా మమ్మల్ని గాని, సైబర్ పోలీసులను గాని సంప్రదించాలని అన్నారు. సైబర్ నేరాలుపై విద్యార్థులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల యజమాన్యం పాల్గొన్నారు.

మీ భూమి మీ హక్కులో రెవెన్యూ సదస్సును సద్వినియోగం చేసుకోవాలి -ఆర్ఐ చెల్లయ్యమ్మ

రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ : మీ భూమి మీ హక్కులో భాగంగా గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజల సద్వినియోగం చేసుకోవాలని మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఆర్ చెల్లయ్యమ్మ అన్నారు. మంగళవారం దూసరపాము గ్రామంలో రెవిన్యూ గ్రామసభ గ్రామ సర్పంచ్ చీడి శివ అధ్యక్షతన జరిగింది. ప్రజలు భూ సంబంధిత అర్జీలను ఆర్ ఐ చెల్లయ్యమ్మకు అందజేశారు. ఇ. పాస్ పుస్తకాలు 3, మ్యుటేషన్లు 10, ఫ్రంట్ లైన్ నిమిత్తం ఒక అర్జీ వచ్చినట్లు రెవిన్యూ ఇన్ స్పెక్టర్ చెల్లయ్యమ్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సత్యనారాయణ, పిసా ఉపాధ్యక్షులు కనిగిరి పరంజ్యోతిరాజు, విఆర్వో అన్నిక శ్రీనివాస్, గ్రామ సర్వేయర్, రాంబాబు, అప్పన్నరెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. అలానే శరభవరం గ్రామంలో తహశీల్దార్ అల్లు సత్యనారాయణ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. మ్యుటేషన్ నిమిత్తం 6, ఈ పాస్ బుక్ ఒకటి, ఫ్రంట్ లైన్ నిమిత్తం ఒక దరఖాస్తు వచ్చినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

నేటి వరకూ నిర్వహించిన 165 గ్రామ రెవెన్యూ సదస్సులు

– కలెక్టర్ పి.ప్రశాంతి

రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ : తూర్పుగోదావరి జిల్లాలో మంగళవారం వరకూ 165 గ్రామాల్లో రెవిన్యూ సదస్సులు నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో తెలియచేసారు. రెవిన్యూ సదస్సు సందర్భంగా ప్రజల నుంచి భూ సంబంధ, రెవిన్యూ శాఖల పరంగా మ్యుటేషన్, కుటుంబ సభ్యుల ధ్రువపత్రాలు, పట్టాదారు పాసు పుస్తకాలు తదితర సమస్యలు పరిష్కారం కోసం ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగిందనీ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకూ ప్రజల నుంచి 1929 అర్జీలు స్వీకరించడం జరిగిందనీ తెలిపారు. మంగళవారం 17 రెవిన్యూ సదస్సులను నిర్వహించి 142 అర్జీలను స్వీకరించడం జరిగింద న్నారు. రెవిన్యూ సదస్సులలో అర్జీలను త్వరితగతిన పరిష్కరించే క్రమంలో 440 అర్జీలను పరిష్కరించినట్లు తెలిపారు.

విశిష్ఠ అవార్డు అందుకున్న ఆదిత్య కిరణ్

కొత్తపేట, మేజర్ న్యూస్ : జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా వినియోగదారులకు విశేష సేవలందిం చినందుకు కొత్తపేటకు చెందిన కోకో ఫెడ్ కార్యదర్శి,ఉమ్మడి తెలుగు రాష్ట్రాల వినియోగదారుల జేఏసీ సభ్యులు సత్తిరాజు ఆదిత్య కిరణ్ రాష్ట్ర స్థాయి విశిష్ట అవార్డు అందుకున్నారు.విజయవాడ శ్రీ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చేతుల మీదుగా మంగళవారం ఆయన అందుకున్నారు.ఈ సందర్భంగా అవార్డు అందుకోవడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. పలువురు అభినందనలు తెలిపి హర్షం వ్యక్తం చేశారు.

ఎక్సైజ్ దాడులలో 800 లీ. బెల్లపు ఊట ధ్వంసం

– 8 మద్యం సీసాలు స్వాధీనం

పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ : పెద్దాపురం ఎక్సైజ్ సిఐ కె.వి.వి.డి.అర్జునరావు ఆదేశాల మేరకు ఆధ్వర్యంలో పెద్దాపురం సర్కిల్ పరిధిలోని జగ్గంపేట మండలంలోని మామిడాడ గ్రామంలో సారాయి తయారీకి నిల్వ ఉంచిన సుమారు 800 లీ. బెల్లపు ఊట ధ్వంసం చేసి, కేసు నమోదు చేయడం జరిగిందని, అలాగే కాట్రావులపల్లి గ్రామంలో అక్రమ మద్యం సీసాలు అమ్ముతున్న ఒక మహిళ వద్ద నుండి 8 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని, ఆమెపై కేసు నమోదు చేయడం జరిగిందని, ఎక్సైజ్ సిఐ కె.వి.వి.డి.అర్జునరావు తెలిపారు. ఈ దాడులలో ఎక్సైజ్ ఎస్సై చిట్టిబాబులు మరియు ఎక్సైజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నట్లు సిఐ తెలిపారు. అలాగే పెద్దాపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పాత సారాయి ముద్దాయిలను పెద్దాపురం తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మి ఎదుట హాజరుపరిచి, 129 బి.ఎన్.ఎస్.ఎస్. ప్రకారం బైండోవర్ చేయడం జరిగిందని సిఐ తెలిపారు.

అన్నదాన భవన నిర్మాణానికి విరాళం

ఆత్రేయపురం,మేజర్న్యూస్ : కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వరస్వామివారి అన్నదాన భవన నిర్మాణానికి మంగళవారం హైదరాబాద్ సరూర్నగర్కు చెందిన సరిపల్లె వెంకటపతిరాజు, సత్యవతి దంపతులు రూ.50 వేలు విరాళంగా అందించారు. వీరికి ఆలయ అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, స్వామి దర్శనం చేయించి, చరిత్ర గురించి వివరించారు. డిప్యూటీ కమిషనర్ నల్లం చక్రధర్ రావు, సిబ్బంది స్వామివారి చిత్రపటం అందించారు.

ప్రతి ఒక్కరు రహదారి భద్రతా ప్రమాణాలు పాటించాలి

– జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు

రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ : జిల్లాలో రహదారుల భద్రతా ప్రమాణాలు ఖచ్చితంగా పాటించేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా రహదారుల భద్రత సమన్వయ కమిటీ సమావేశం జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో డిఎస్ ఏ కే సుబ్బరాజు, డిటిఒ ఎం.సుమేష్ ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు మాట్లాడుతూ జిల్లాలో రహదారుల భద్రత కోసం పటిష్టమైన చర్యలు తీసుకుంటూ ప్రమాదాలను అరికట్టి ప్రజల ప్రాణాలకు భద్రత కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రధాన రహదారిలో రోడ్లకు ఇరువైపులా ఉన్న చెట్ల పొదలను తొలగించడంతో పాటు స్పీడ్ బ్రేకర్ల ముందు, వెనుక భాగాల్లో పెయింటింగ్ వేయాలన్నారు. జిల్లాలో జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులు, ఇతర రహదారి మార్గంలో 35 బ్లాక్ స్పాట్స్ వాటిలో 17 ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించినట్లు తెలిపారు. అందులో జాతీయ రహదారులు పై 27 బ్లాక్ స్పాట్స్ ప్రాంతాలలో 16 చోట్ల

ఎక్కువ ప్రమాదాల స్పాట్స్ ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా గత ఆగష్టు 9 వ జరిగిన సమావేశ అనంతర చర్యలపై సమావేశంలో చర్చించడం జరిగింది. జిల్లాలో ఉన్న జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులలో సంయుక్త తనిఖీలు నిర్వహించి ప్రమాద ఘంటికల ప్రదేశాలను గుర్తించి తీసుకోవాల్సిన చర్యలపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించి ఆ మేరకు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని అమలు చేయాలన్నారు. వాహనాల రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో బారికేడ్స్, స్టాపర్స్, ప్రమాద సంకేత సూచికలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా పాఠశాలలు, కళాశాలలు ప్రజలకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి టోల్ ప్లాజాలో అంబులెన్స్ తదితర అంశాలపై ప్రజల్లో అవగాహన తీసుకురావాల న్నారు. ఆర్టీసీ బస్టాండు, ప్రభుత్వ సర్వజన వైద్యశాల తదితర ముఖ్య కూడలి రద్దీ ప్రదేశాల్లో రహదారుల ఆక్రమణలపై ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని మున్సిపల్, ట్రాఫిక్ అధికారులను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. డిఎస్ ఏ కే సుబ్బరాజు మాట్లాడుతూ రహదారి భద్రత పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించేలా అవగాహన కల్పించాలన్నారు.జిల్లా రవాణాధికారి ఎం.సురేష్ జిల్లాలో రవాణా శాఖ ద్వారా అమలు జరుగుతున్న కార్యాచరణను నివేదిక రూపంలో కమిటీకి వివరించారు. ఈ సమావేశంలో ఆర్ అండ్ బి ఈ ఈ ఎస్ పి వి రెడ్డి, డీఈఓ కే వాసుదేవరావు, యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధి ఎం నరసింహ నాయక్, నేషనల్ హైవే ప్రాజెక్టు మేనేజర్ కే సుబ్రహ్మణ్యం, టీం లీడర్ ఏ శ్రీనివాసరావు, ఏపీఎస్ఆర్టీసీ సూపర్డెంట్, పీబీఎస్ రాజు, డి సి హెచ్ ఎస్ పద్మశ్రీ, జిల్లా రవాణా శాఖ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

28న వేద స్వస్తి

కాకినాడ, మేజర్ న్యూస్ : శ్రీ బ్రాహ్మణ అభివృద్ధి సమాఖ్య సేవా సంఘం ఆధ్వర్యంలో లోక కళ్యాణార్థం ఈనెల 28న స్థానిక రామారావుపేటలోని వేద విజ్ఞాన ప్రతిష్టాన కార్యాలయంలో (యూనియన్ బ్యాంక్ ప్రక్కన) వేద స్వస్తి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సంఘ వ్యవస్థాపక అధ్యక్షులు పసుమర్తి సత్యనారాయణమూర్తి తెలిపారు. 28 శనివారం సాయంత్రం ఐదు గంటల నుండి ఈవేద స్వస్తి ప్రారంభమవుతుందని, గరిమెళ్ళ లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులు సహాయ సహకారాలతో ఈకార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందరూ పాల్గొని విజయవంతం చేయవలసిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.

టీటీడీ పాలక మండలి రెండవ సమావేశంలో టీటీడీ బోర్డు సభ్యులు జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట, మేజర్ న్యూస్ :అతి త్వరలో శ్రీవారి భక్తులకు కేవలం గంటలోగా దర్శన భాగ్యం కల్పించేందుకు టీటీడీ ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని చైర్మన్, బోర్డు సభ్యులు తెలిపారు.తిరుమలలో మంగళవారం టీటీడీ పాలకమండలి సమావేశాన్ని చైర్మన్ అధ్యక్షతన నిర్వహించారు. టీటీడీ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన బీఆర్ నాయుడు రెండవ దఫా పాలక మండలి సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట శాసనసభ్యులు, టీటీడీ పాలక మండలి సభ్యులు జ్యోతుల నెహ్రూ పాల్గొన్నారు. మొదటి పాలకమండలి సమావేశంలో కీలక నిర్ణయాలను తీసుకున్న టీటీడీ, రెండవ పాలకమండలి సమావేశంలోనూ భక్తులకు సంబంధించి పలు అంశాలపై చర్చించారు.ప్రధానంగా తిరుమల కు వచ్చే భక్తులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా గంటలోగా దర్శనం కల్పించేందుకు అధ్యయనం చేస్తున్నట్లు చైర్మన్ తెలిపారు. ఇప్పటికే 4 కంపెనీలు డెమో ఇచ్చాయని, ప్రస్తుతం ట్రయల్ రన్ జరుగుతున్నట్లు చైర్మన్ అన్నారు. పాలకమండలి సమావేశం అనంతరం ఈవో శ్యామల రావు మాట్లాడుతూ.. టీటీడీ నిర్వహించే కార్యక్రమాలు ప్రపంచవ్యాప్తంగా తీసుకెళ్లాలని సీఎం చంద్రబాబు సూచనలు చేసినట్లు, అందుకు తగిన విధంగా టీటీడీ తగిన కార్యాచరణరూపొందిస్తుందన్నారు.స్విమ్స్ కు జాతీయ హోదా కోసం కేంద్ర ప్రభుత్వాన్ని కోరడం జరిగిందన్నారు. నడక మార్గంలో ఆరోగ్య సమస్యల కారణంగా మరణాలు సంభవించకుండా ప్రత్యేక చర్యలకు ప్రణాళిక రూపొందించామని ఈవో తెలిపారు. భక్తులకు అందించే సేవలపై ఫీడ్ బ్యాక్ సిస్టం ఏర్పాటు చేయనున్నట్లు, అందుకై పాలకమండలిలో కీలక నిర్ణయం తీసుకోవడం జరిగిందని ఈవో అన్నారు. దేశంలోని ప్రతి రాజధానిలో టీటీడీ ఆలయాలను నిర్మించేందుకు పాలకమండలి నిర్ణయించింది.ఈ నేపథ్యంలో ముంబైలో స్వామివారి ఆలయాన్ని 10 ఎకరాలు నిర్మించేందుకు టీటీడీ ముందడుగు వేస్తోంది. క్యూలైన్లో టాయిలెట్స్ కట్టాల్సిన అవసరం ఉందని, రూ.3 కోట్లతో టాయిలెట్స్ కాంప్లెక్స్ నిర్మాణా నికి పాలకమండలి ఆమోదం తెలిపింది. తిరుమలలోని ఓ మఠానికి షోకాజ్ నోటీసు జారీ చేయడం జరిగిందని, ఇంకా ఆ మఠం నుండి తగిన సమాధానం రాలేదన్నారు. మఠం నుంచి బదులు రాగానే తదుపరి చర్యలు తీసుకుంటామని శ్యామలరావు తెలిపారు.

యుటిఎఫ్ నూతన అధ్యక్షుడిగా సంజీవ్..

ఏలేశ్వరం, మేజర్న్యూస్ : ఏలేశ్వరం నగర పంచాయతీ పరిధిలోని పెన్షనర్స్ హోం లో నిర్వహించిన యుటిఎఫ్ నూతన కార్యవర్గ ఎంపికలో అధ్యక్ష కార్యదర్శులుగా ఎస్ సంజీవ్, కే రవిలు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ ఎన్నికలకు యుటిఎఫ్ నాయకులు జట్ల సోమరాజు ఆధ్వర్యంలో సీనియర్ నాయకులు మెతకాని రాంబాబు, జిల్లా అధ్యక్షులు నగేష్, జిల్లా కార్యదర్శి పి వీవి సత్యనారాయణ, ఎస్ రాంబాబులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వేదికపై వారు మాట్లాడుతూ జనవరి 5 6 7 8 తేదీలలో జిల్లా కేంద్రం కాకినాడలో యుటిఎఫ్ రాష్ట్ర స్వర్ణోత్సవ మహాసభలు జరుగుతాయని, దీనికి రాష్ట్ర నలుమూలల నుంచి ఉపాధ్యాయులు వేలాదిగా తరలి తరలివచ్చి సభను విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నూతన కార్యవర్గ ఎన్నికల్లో ఎన్నికైన మండల ఆఫీస్ బేరర్స్ ఎన్ నాగమణి, బి రాంబాబు, రవి మురళి, రాజు అప్పారావు గంగాధర్ రావు, దేవదేవి శిరీష శ్రీనివాసరావు సత్యనారాయణ, వి వీరబాబు, ఎం శ్రీనివాసరావు, నాగేంద్రరావు, వి ఆర్ కె రెడ్డి, ఎన్ రాజు తదితరులు ఉన్నారు.

పారిశుద్ధ్య కార్మికులు చేసిన సేవలు మరువలేనివి

– ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, మేజర్ న్యూస్ : విజయవాడ వరదల సమయంలో పారిశుద్ధ్య కార్మికులు చేసిన సేవలు మరువలేనివని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం కొవ్వూరు మున్సిపల్ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులను పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ముప్పిడి వెంకటేశ్వరరావు, చైర్పర్సన్ భావన రత్నకుమారి లు విజయవాడ పట్టణంలో వరదల సమయంలో సేవలందించిన 30 మంది పారిశుద్ధ్య కార్మికులకు ఒక్కొక్కరికి రెండు జతలు దుస్తులు పంపిణీ చేశారు. అదేవిధంగా ఈనెల 21వ తేదీ కొవ్వూరు ఏబీఎన్ కాలేజీలో వికాస ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాలో సేవలందించిన మున్సిపల్, సచివాలయాల సిబ్బందిని మెమెంటోళ్లు అందించి సత్కరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్పర్సన్ భావన రత్నకుమారి మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు లేకపోతే ఏ పట్టణం శుభ్రంగా ఉండదు అన్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉంటున్నారన్నారు.

కార్మికులు చేస్తున్న సేవలను అభినందిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇటీవల విజయవాడలో బుడమేరు వరదలు రావడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రజాప్రతినిధులతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మున్సిపాలిటీల నుండి అధికారులు పారిశుద్ధ్య కార్మికులు విజయవాడ పట్టణంలో సేవలందించడం జరిగిందన్నారు. విజయవాడలో పారిశుద్ధ్య సేవలు అందించిన 30 మంది కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం అందించిన రెండు జతల దుస్తుల పంపిణీ చేయడం జరిగింది అన్నారు. 2027 లో గోదావరి నదికి పుష్కరాలు రానున్నందున కొవ్వూరు పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. పుష్కర యాత్రలకు ఎటువంటి అసౌకర్యం కలవకుండా పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచి ఆదర్శవంత మున్సిపాలిటీగా తయారు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, కమిషనర్ టీ. నాగేంద్ర కుమార్, మేనేజర్ పి.సాయిబాబా కార్మికులు పాల్గొన్నారు.

పెద్దాపురం డివిజన్లో వర్షపాతం వివరాలు

పెద్దాపురం, మేజర్ న్యూస్ : పెద్దాపురం డివిజన్లోని 11 మండలాలలో మంగళవారం ఉదయం నమోదైన వర్షపాతాల వివరాలు. కోటనందూరు మండలం 0.0 మి.మీ., తుని 0.2 మి.మీ., రౌతులపూడి 0.2 మి.మీ., శంఖవరం 1.0 మి.మీ., ఏలేశ్వరం 2.0 మి.మీ., జగ్గంపేట 1.2 మి.మీ., కిర్లంపూడి 1.0 మి.మీ., ప్రత్తిపాడు 2.4 మి.మీ., తొండంగి 1.0 మి.మీ., పెద్దాపురం 1.2 మి.మీ., గండేపల్లి 2.8 మి.మీ., వర్షపాతం నమోదైనట్లు ఆర్డీఓ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

కరెంటు బిల్లులు అధికం చేయడం తగదు

– సామాజికవేత్త దూసర్లపూడి రమణరాజు

కాకినాడ, మేజర్ న్యూస్ : కరెంటు బిల్లులు పెంచే ప్రసక్తే లేదని పదేపదే విస్మృత ప్రచారం చేసి అనూహ్య మెజారిటీ స్థానాలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కరెంటు చార్జీలు పెంచడం దారుణంగా ఉందని ప్రముఖ సామాజికవేత్త దూసర్లపూడి రమణరాజు పేర్కొన్నారు. గత ఏడాది కొన్న కరెంటు అధికం కావడం వలన ఆ భారాలు ఇప్పుడు మోయాలంటూ ఏరియర్స్ బిఇఎఫ్ఎఎఫ్టి పేరిట ప్రస్తుత బిల్లుకు అదనంగా గత ఏడాది బిల్లు ఛార్జీ చేర్చి వసూలు చేయడం వలన విద్యుత్ వినియోగదారులపై తీవ్ర ప్రభావం ఏర్పడిందన్నారు. జనవరిలో మరో అదనపు ఛార్జీ చెల్లించాల్సి ఉంటుందని చెబుతున్నారన్నారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడం వలన సామాన్యుడు మధ్యతరగతితోబాటుగా అన్ని వర్గాల ప్రజలు తీవ్రంగా నలిగిపోయే దుస్థితి వుంటుందన్నారు. ప్రస్తుతం గడువులోగా చెల్లించలేక పోతే పెనాల్టీతో చెల్లించే అవకాశం ఆ గడువు దాటిపోతే అదనపు పెనాల్టీతో కరెంటు బిల్లులు చెల్లించుకునే అవకాశం వుందని స్మార్ట్ మీటర్ల వలన ముందుగా డబ్బు చెల్లిస్తేనే కరెంటు సరఫరా వుంటుందన్నారు. స్మార్ట్ మీటర్ బిగించిన గృహంలో అదనంగా ఏసి, వాషింగ్ మెషిన్, గ్రైండర్ మోటార్ వంటివి వుంటే అదనపు లోడ్ వేసుకుంటే తప్ప కరెంటు వినియోగం రాదన్నారు. ఇందువలన యూనిట్ చార్జీలు రేటు పెరుగుతుందన్నారు. ఇప్పటికే నిత్యావసరాల ధరలు వంద రెండు వందల వంతున పెరిగిందని, కరెంటు భారాల వలన మరింత పెరుగుతాయని, ప్రజలకు ఆర్థిక కష్టాలు మరింత ఎక్కువ అవుతాయన్నారు. కరెంటు బిల్లులు అధికంగా పెంచిన ప్రభుత్వం మంచి ప్రభుత్వం ఎలా అవుతుందని ప్రశ్నించారు. చిత్తశుద్ధి ఉంటే కరెంటు భారాలు పెంచకుండా పాలన చేయాలన్నారు. రమణరాజు నివాస గృహ కరెంటు బిల్లులను కుళాయి చెరువు ప్రక్కనున్న కరెంటు కార్యాలయంలో చెల్లించి రసీదులు తీసుకున్న అనంతరం.. కరెంటు బిల్లులు అధికంగా పెంచిన ప్రభుత్వం మంచి ప్రభుత్వం కాదని నల్ల అక్షరాలు వ్రాసిన ధర్మో కూల్ షీట్ చేపట్టి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వంపై నిందలు వేసి దుష్ప్రచారం చేయడానికి ఇది తన వ్యక్తిగత అభిప్రాయం కాదని ప్రజలలో నివురు గప్పిన నిప్పుగా వున్న ఆవేదనగా ప్రభుత్వం గ్రహించడం మంచిదన్నారు

అర్జీలపై నాణ్యమైన, సంతృప్తికరమైన సత్వర పరిష్కారాలను అందించాలి

కాకినాడ, మేజర్న్యూస్ : ప్రజా విజ్ఞాపనల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) ద్వారా అందిన అర్జీలపై నాణ్యమైన, సంతృప్తికరమైన సత్వర పరిష్కారాలను ప్రజలకు అందించాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా జిల్లా అధికారులను కోరారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ వివేకానంద సమావేశ హాలులో పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించే అంశాలపై జిల్లా అధికారులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, డిఆర్ఓ జె.వెంకట్రావు, సిపిఓ పి.త్రినాద్ అధికారులకు జిల్లాలో పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కార ప్రగతి, మరింత మెరుగైన పరిష్కార సేవలు అందించేందుకు జిల్లా అధికారులు చేపట్ట వలసిన చర్యలపై వివరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్ఎస్ ర్యాంకింగ్ ప్రధానంగా 5 పరామితులమీద నిర్ణయిస్తారని, ప్రజల నుండి అందిన అర్జీల సంఖ్య, నిర్దిష్ట కాలపరిధిలో పరిష్కరించిన అర్జీల సంఖ్య, అర్జీదారులకు సంతృప్తితో అందించిన నాణ్యమైన పరిష్కార సంఖ్య, ప్రజాప్రతినిధులు సూచించిన అంశాలపై పరిష్కారాలు, వాటిలో సంతృప్తి నందించిన పరిష్కారాలు అనే అంశాల ఆధారంగా జిల్లాలకు ర్యాంకింగ్ ఇస్తారన్నారు. జిల్లాలో పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కార స్థాయి 62.7 శాతంగా ఉందని, దీనిని మరింత మెరుగుపరచి రాష్ట్ర స్థాయిలో మంచి ర్యాంకింగ్ సాధించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. అర్జీల పరిష్కారంలో నిర్దేశించిన విధివిధానాలను సమగ్రంగా పాటించి, చేపట్టిన చర్యల సమాచారాన్ని, అర్జీదారునికి పరిష్కారంపై వివరించి తీసుకున్న ఫోటోలను ఆన్ లైన్ లో సక్రమంగా అప్ లోడ్ చేయాలని ఆయన ఆదేశించారు. అర్జీల పరిష్కార నాణ్యత, అర్జీదారుల సంతృప్తి సాధన, రిఓపెన్ చేసిన అర్జీలు అంశాలను జిల్లా అధికారులు ఆడిట్ చేసుకోవాలన్నారు. అర్జీల పరిష్కారాన్ని గడువు సమీపంచే వరకూ జాప్యం చేయకుండా సకాలంలో చర్యలు పూర్తి చేయాలని సూచించారు. తన క్రింది స్థాయిలోన పరిష్కార అధికారులందరికీ పిజిఆర్ఎస్ విధానంపై సమగ్రమైన అవగాహన కల్పించాలని జెసి జిల్లా అధికారులును ఆదేశించారు. అన్ని ప్రభుత్వ శాఖలలో ఉద్యోగులందరూ హౌస్ హోల్డ్ మాపింగ్ మాడ్యూల్లో తమ సమచారాన్ని వెంటనే అప్లోడ్ చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.ఈ సమావేశంలో ఆర్డిఓలు ఎస్.మల్లిబాబు, కె.శ్రీరమణి, డిఎల్డిఓ కె.వాసుదేవరావు, ఎస్డిసి వెంకట్రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

డీఎడ్ కళాశాల పిడి పై చట్టపరమైన చర్యలకు డిమాండ్

– ఎమ్మెల్యే మిరియాల శిరీష విజయభాస్కర్

రంపచోడవరం,మేజర్న్యూస్ : గిరిజన విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన డీ ఎడ్ కళాశాల పిడి పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష విజయభాస్కర్ డిమాండ్ చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం ఐటీడీఏ ఆధ్వర్యంలో నడుస్తున్న రంపచోడవరం ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణ కళాశాల (డీఎడ్ కళాశాల) లో పనిచేస్తున్న కె.పోతురాజు (పి.డి) అను వ్యక్తి కళాశాల విద్యార్థుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన తీరును విద్యార్థులు మీడియాకు తెలియపరచడంతో విషయం తెలుసుకున్న రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష విజయ భాస్కర్ మంగళవారం కళాశాలకు వెళ్లి పరిశీలించడం జరిగింది.

ఈ సందర్భంగా విద్యార్థులందరూ కళాశాలలో పిడి పోతురాజు విద్యార్థినిలకు ఇబ్బంది పెట్టిన తీరును, ఎక్కడబడితే అక్కడ ముట్టుకోవడం, అసభ్యకరంగా ప్రవర్తించిన తీరును విద్యార్థినులతో కులాలను, మతాల అంశాలను మాట్లాడుతూ ఉండేవాడని ఎమ్మెల్యే శిరీష భాస్కర్కు వారి గోడును వెళ్ళబుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిరీష విజయభాస్కర్ మాట్లాడుతూ విద్యార్థుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించటం హేయమైన చర్య అని, ఆ రకంగా ప్రవర్తించినవారిపై చట్టపరంగా శిక్ష పడాల్సిందేనని మీడియా ముందు మాట్లాడడం జరిగింది. మరీ ముఖ్యంగా ఆ వ్యక్తి తను చేసిన తప్పును కప్పిపుచ్చుకోవడానికి గిరిజన సంఘం నాయకుల మద్దతు కోరడం తప్పు అని, గిరిజన సంఘం పెద్దలందరూ వాస్తవాలు తెలుసుకొని ఇటువంటి ఘటన జరగకుండా అందరం చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షులు మఠం విజయభాస్కర్, రంపచోడవరం నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త కుర్లా రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'చేయూత'లో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

కాకినాడ, మేజర్న్యూస్ : కులమతాలకు అతీతంగా పండుగ నిర్వహించుకోవడం చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రధాన ఆశయమని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ఎం.రవి కుమార్ అన్నారు. రోటరీ చేయూత భవన్లో "ఫ్రీ క్రిస్మస్ వేడుకలను" లాంఛనంగా ఆయన ప్రారంభించారు. సమావేశానికి సంస్థ ప్రధాన కార్యదర్శి అలీమ్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా కాకినాడ జిల్లా విద్యాశాఖ అధికారి అసిస్టెంట్ డైరెక్టర్ వినయ్ మోహన్ పాల్గొని ప్రసంగిస్తూ పండుగల తాలుకు విశేషాలను పిల్లలకు వివరిస్తూ వారందరిని భాగస్వామ్యం చేయడం మంచి సంప్రదాయమని అన్నారు.సర్వమానవ సౌభ్రాత్రుత్వాన్ని ఆచరణలో పెట్టిన చేయూత సంస్థ నిర్వాహకులను అభినందించారు. క్రిస్మస్ వంటి పండుగలలో అందరిని ఆహ్వానించడం గొప్పవిషయ మన్నారు. వీటి వల్ల మతసామరస్యానికి చేయూత కృషిచేస్తోందని కొనియడారు. విద్యాశాఖలో ఉన్నత స్థానంలో పనిచేస్తున్న డా.రవి ఇటువంటి ఆలోచనలు చేయడం అభినందనియమన్నారు. భవిష్యస్తులో ఈ సంస్థకు తప్పక సహాయసహకారాలు అందిస్తామన్నారు. తొలుత సమావేశంలో చేయూత మహిళ అధ్యక్షురాలు సురభి శారద ప్రారంభిస్తూ క్రీస్తు యొక్క ఆశయాలను వివరించారు. సమాజ సేవ ద్వారా అందరినీ ఆదుకోవాలన్న క్రీస్తు యొక్క ఆశయమని పలు అంశాలను ప్రస్తావించారు. అదే బాటలో చేయూత సంస్థ కూడా పయనిస్తూ వేలాదిమందికి అండగా నిలిచిందని కొనియాడారు. సంస్థ ప్రధాన కార్యదర్శి అలీ మాట్లాడుతూ మానవత్వ విలువల పెంపొందించడమే తమ సంస్థ ఆశయమని చెప్పారు. ప్రతి విద్యార్థి ఉత్తమ పౌరునిగా ఎదగడానికి అవసరమైన కార్యక్రమాలను నిర్వహిస్తూ వారందరికీ అండగా ఉంటున్నామని అదే క్రిస్మస్ పండుగ యొక్క లక్ష్యం అన్నారు. కార్యక్రమంలో సంస్థ ఆర్థిక కార్యదర్శి నారాయణమూర్తి, ఇందిర, వీర్రాజు, విజయ్, వర్మ, శ్రీరామ్, అంగటి లక్ష్మి, ఝాన్సీ, పవన్, శ్రీరామ్ తోపాటు విద్యార్థులు పాల్గొన్నారు. క్రిస్మస్ కేకును అతిథుల సమక్షంలో డైరెక్టర్ వినయ్ మోహన్ కట్ చేసి విద్యార్థులకు అందజేశారు. క్రిస్మస్ సందర్భంగా చేయూత సంస్థ ఆధ్వర్యంలో ఆ ఏర్పాటు చేసిన క్రిస్మస్ నమూనా చిత్రాల ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. పిల్లలందరికీ విందుభోజనాలను అతిథుల చేతులమీదుగా వడ్డించారు.